# నాన్న కావాలి

(ఆంధ్రపత్రిక 1982)

నష్టపోయిన మన జీవితాన్ని
మనం బాగుచేసుకోవడంలో తప్పులేదు
కాని దానివల్ల మరొకరి జీవితాన్ని
నష్టపరిచే హక్కుమనకు లేదు

నా స్నేహితురాలు స్వప్నకూతుర్ని చూస్తుంటే నాకు చాలా బాధగా ఉంటుంది. పదమూడేళ్ల వయసులో వుండాల్సిన ఛలీకీతనం ఆ పిల్ల కదలికల్లో వుండనే ఉండదు. గంతులేసే ఆశలు ఆ పిల్ల కళ్లల్లో నాకు కన్పించవు. నిన్న మొన్న టీనేజ్ ఎంటరయిన ఆపిల్లముఖంమీద నేనేనాడూ సున్నితమైన నును సిగ్గును గమనించలేదు. మామూలు ప్రకారం ఈ రోజు కూడా నేను నా స్నేహితురాలింటి గడపలో కాలుపెట్టగానే అందరిపిల్లల్లా 'హాయ్' ఆంటీ అని వచ్చినన్ను కౌగలించుకోలేదు. చిన్న చిరునవ్వునా మొహానపారేసి లేచి తనగదిలోకి వెళ్లబోయింది శైలజ.

"శైలూ! ఒన్ సెకండ్" తిరిగి చూసింది శైలు

"ఇదిగో క్యాడ్‌బరీ"

"క్యాడ్‌బరీ ఎందుకాంటీ?" అన్న ఆ పిల్లలే అధరాలమీదనుండి నాకు విన్పించని భావం, నేనూహించిన భావంవేరే. చిన్నప్పటి నుండి నన్ను అడిగిన కోరక ఒకే ఒక్కటి. నాకు నాన్నకావాలి ఆంటీ. అడిగి అడిగి అలసిపోయిందో, వయసు పాఠాలు నేర్పిందో ఈ మధ్య ఆ ప్రస్తావన తేవడం శైలు.

నాలో పశ్చాత్తాపం స్వప్న మోహన్ మధ్య మనస్పర్థలొచ్చి, విడాకులదాకా వచ్చినపుడు తను స్వప్నను ప్రోత్సహించాల్సిందికాదు.

"శైలూ అమ్మకు కన్పించేసివస్తాను. ఎక్కడికి వెళ్లకు" సరేనన్నట్టు తలూపింది శైలజ.

నన్ను చూసి గ్రైండర్‌లో పప్పువేసి గ్రైండ్ చేస్తున్న స్వప్న ప్లగ్ స్విచ్ ఆపింది.

"రాచాలా రోజులయింది నిన్ను చూసి ఆ! మా అన్న కొడుకు తేజా మరీ చెడిపోతున్నాడు. వాడితో ఈ మధ్య అన్నీ గొడవలే అందుకే రాలేకపోయాను"

"తేజ వాళ్లమ్మ దగ్గర కదా వున్నాడు" చేతులు కడుక్కుంటూ అంది స్వప్న.

"వదిన దగ్గరే వున్నాడు పాపం వదిన, తండ్రిభయంలేక పన్నెండేళ్ల తేజ రౌడీలతో తిరుగుతున్నాడు"

స్వప్న గిల్టీగా తలవంచుకుంది

"స్వప్నా భార్యాభర్తల మధ్య ఎన్ని బాధలున్నా విడాకులు తీసుకోకూడదే"

'చివుక్కున తలెత్తింది స్వప్న, తృటిలో ఆమె కళ్లల్లో మెరిసేకన్నీరు

"సారీ.... సారీ స్వప్నా"

"సారీ ఎందుకు సీతా .... నా మనసులోనే సమాధి చేసుకున్న ఈ నిజాన్ని నువ్వు బయటకు చెప్పావంతే"

"ఆరోజు నేనైనా నిన్ను వారించానుకాదు" స్వప్న కళ్లల్లో నీరు ఆమె కళా విహీనమైపోయిన బుగ్గలమీదుగా జారిపోయింది'

'నువ్వు చెప్పినా నేను వినుండేదాన్ని కాదులే నీతా ఆరోజుల్లో, ఆడదంటె అబలకాదనీ, స్వతంత్రంగా ఒంటరిగా బ్రతగ్గలదని చెప్పే పుస్తకాలు చదవి చదివీ అది నిజమనుకున్నానే...." అగింది స్వప్న. గొంతులో కన్నీళ్లు అడ్డుపడినట్టున్నాయి.

"హు.... బ్రతగ్గలననుకోవడం ఏమిటిలే బ్రతుకుతూనే వున్నానుకదా! కాకపోతే అపరాధాలు మోస్తూ, నిస్సారంగా చావు కొరకు ఎదురుగ చూస్తూ...

ఛ ఛ అలా అనకు నీకు మేమంతా లేమూ.. శైలూ లేదు? అలాఎప్పుడూ అనుకోకు ఓదార్చబోయాను.

స్వప్న తన కన్నీళ్లను తానేమింగేసింది. "ఉండు స్టౌ మీద పాలుపడేసివస్తాను. నీకు టీనా కాఫీనా?"

"నా కేమీ వద్దు నేను శైలూతో కాసేపు మాటాడేసి వెళ్తాను. నువ్వు నీపని చూసుకో" అనేసి గిల్టీగా ఫీలవుతూ శైలజ గదివైపు నడిచాను.

చెయ్యగలిగిందేమీ లెనప్పుడు గతాన్ని తవ్వుకోవడం ఎంత తెల వితక్కువతనం! మోహన్‌కి తిరిగి పెళ్లవడం, ఇద్దరు సంతానం కలగడం.... అంతా అయిపోయాక ఇప్పుడా ప్రస్థావన ఎత్తి స్వప్నకళ్లలో ఘనీభవించిన కనీటిని రెచ్చగొట్టడం ఎందుకు?

శైలు కిటికీలోనుండి బయటకు చూస్తోంది. "ఏమిటి శైలూ అక్కడేం చేస్తున్నావు?" 'ఊసుపోని ప్రశ్నవేశాను.

"ఏవిలేదాంటీ ఎదురింటి కిషోర్ కబాడీ ఆడుతోంటే వాళ్లనాన్న కోప్పడ్తున్నారు"

టీనేజ్‌లో అడుగు పెట్టింది కదా. కాస్త గుంభనంగా మాట్లాడ్డం నేర్చుకుంటున్నట్టుంది శైలు కాకపోతే అదో పెద్ద దృశ్యమా ఆ వయసులో పిల్ల అదేపనిగా అటుచూడడానికి?

"ఎంత అదృష్టవంతుడో కిషోర్" ఉలిక్కి పడ్డాన్నేను. నిజానికి ఈ ఇంటి ముంగిట నిర్లిప్తంగా నిలబడున్న శైలును చూసినపుడు ఆ పసిపిల్లతో తండ్రిగురించి మాట్లాడా లనుకున్నాను కానీ నా స్నేహితురాలి వేడికన్నీరు చూసిన తర్వాత మనసు మార్చుకుని కేవలం పలకరించి వెళ్ళాలని ఆ గదిలో వెళ్ళాను. కానీ నాదగ్గర నుండి ఓదార్పు నాసిస్తోందో, పరిష్కారాన్నే కోరుతోందో, సలహానే ఆశిస్తోందో తండ్రి లేని తను దురదృష్టవంతురా లినని చెప్పక చెప్పిన శైలూని పలకరించేసి వెళ్ళలేకపోయాను.

"ఏమ్మా అలావున్నావుశైలూ"

కళ్ళు దించుకుంది శైలజ

"ఆంటీ నాకు చచ్చిపోవాలనుందాంటీ" నేను తృళ్ళిపడ్డాను. ఇంతపెద్ద పదాన్ని ఆపిల్లనోటి వెంట నేనువింటానుకోలేదు.

"ఛ ఏమిటది శైలూ! అలా అనచ్చా? నీకు అమ్మ ఏం తక్కువచేస్తోంది చెప్పు?" చప్పున కళ్ళెత్తిన ఆ అమ్మాయి కనుచూపుల్లో నిష్ఠుర భావప్రకటన.

నా తప్పునాకర్థమయింది. ఆ పిల్లకోరేది ఓదార్పు. నేను నాస్నేహితురాల్ని సమర్థించడం న్యాయంకాదు. అసలే బాల్యంవీడి టీనేజ్‌లో ఎంటర్ అయ్యేపుడు పిల్లల మనస్తత్వంలో అవాంఛనీయమైన మార్పులొస్తాయి పైగా తండ్రిలేని అసంతృప్తి.

"శైలూ" పిల్చాను

శైలజ మాట్లాడలేదు నేనే దగ్గరకెళ్ళి కూర్చున్నాను.

"ఏమ్మా! ఇంత చిన్న వయసులో నీకలా ఎందుకన్పించిందో చెప్పవా?"

"ఏమీలేదాంటీ" సభ్యతను పాటిస్తూ ఆపెదాలు నవ్వాయికానీ ఆ లేత కళ్ళల్లో చిరునవ్వు ఛాయలూకు ప్రతిబింబంలేదు.

"నాకు చెప్పకూడదా? నేను మీ అమ్మలాంటిదాన్ని కాదాశైలూ" ఆ పిల్లను దగ్గరకు తీసుకుంటూఅన్నాను. ఈసారి ఆ పిల్ల కళ్ళల్లో ఏదో ఆశ అదిరి అధరాల మీద పడి ఏదో చెప్పుకోవాలనే ఆరాటం. బాల్యం వీడి కౌమార్యంలోకి అడుగుపెడ్తున్న శైలజలో బాల్యం తాలూకు నిస్సంకోచం, టీనేజ్ తాలూకు సంకోచం, రెండూ కలిసిన ఓ విలక్షణమైన భావం ప్రసవవేదన పడ్తున్నట్టుంది. ఆ అమ్మాయి చాలా సేపు మాట్లాడలేదు.

"నాకు చెప్పవూ?" గడ్డం ఎత్తిపట్టి అడిగాను.

"నాకు నాన్నను చూడాలనివుంది" ఆ చిన్న వాక్యాన్ని శబ్దతరంగాలుగా మార్చడానికి ఆ చిన్నపిల్లచాలా కష్టపడింది.

"నాన్న దగ్గరకు తీసుకెళ్ళనా?"

శైలూ కోరకకు కదిలిపోయా "ఊహూ, అమ్మ బాధపడ్తుంది"

నేను ఆనందపడ్డాను ఆ పసిపిల్ల 'అమ్మకోప్పడ్తుంది' అని అనలేదు. అమ్మ బాధపడ్తుందనంటోంది. నా కూతురు శ్రీదివ్య 'మమ్మీ! నేను సినిమాకెళ్తున్నాను, నాన్నకు చెప్పకు కోప్పడ్తారు అంటుంది. ఎంత తేడా. ఇద్దరి వయస్సులూ ఒక్కటే. కానీ పరిస్థితులు

పిల్లల్ని అంత ఆరిందాన్ని చేస్తాయా?

"మరి నాన్న కావాలన్నావు?"

"నాకు ఇద్దరూ కావాలి కానీ ఎలా?" ఆ పిల్లవేసిన చిన్న ప్రశ్నలో ఎంత నిరాశ!

"నీకు నాన్న గుర్తున్నారా?"

'ఆ బాగా... తెల్లగా, పొడవుగా..." అందంగా... ఆపిల్ల పరవశించి చెప్తోంది ఆ పరవశానికి అడ్డుకట్టవేశాను.

"అప్పుడు నీకు ఆరేళ్లే.... శైలూ.... నీకు నిజంగా గుర్తున్నారా?"

"అందరూ గుర్తుంటారా ఆంటీ ఆయన మా నాన్న"

ఆ పసిపిల్ల ఇచ్చిన జవాబులో 'తండ్రి గుర్తున్నాడు అనేకంటే తనకు తండ్రి ఎంత కావాలో గుర్తుచేస్తున్న సత్యం ఉంది.

"ఇట్సోకే ఆంటీ మా మమ్మీ తను తప్పుచేసి, నన్ను కోప్పడ్తుందేం?" కాస్త ఉక్రోషంగా అంది ప్రొద్దున్నె స్వప్న కోప్పడిందో ఏమో!

"ఆ పరిస్థితులలాటివి. మీ అమ్మను తప్పుపట్టకు శైలూ!" అలాఅనేశాక అలా అనుకుండావుండాల్సిందనుకున్నాను. కానీ ఆ సారి నేను ఊహించినట్టుగా శైలు నొచ్చుకోలేదు గిల్టీగా ఫీల్ అయింది.

"తప్పంటె తప్పనికాదు. కానీ నాకు నాన్నలేడని నా క్లాసు పిల్లలు నన్ను ఎలా గేలిచేస్తారనీ! చెప్పండాంటీ ఇందులో నా తప్పేముంది? వాళ్లలాఅన్నప్పుడల్లా నాకు చాలా ఏడుపొస్తుంది. ఇప్పుడంటే ఊర్కుంటున్నాను కానీ చిన్నప్పుడు అన్నవాళ్లను కొట్టేదాన్ని కొట్టించుకునేదాన్ని ఆ ఉక్రోషంలో ఇంటికొచ్చినాన్నేడీ అని అడిగితే అమ్మకొట్టేది. ఒక్కోసారివిసుక్కునేది"

నాకు నవ్వొచ్చింది. ఎట్‌సేమ్ టైమ్ జాలేసింది. ఆ పిల్ల కిప్పుడు ఎంత వయసనా? తను పెద్దదయిపోయిందని అనుకోవడానికి

"ఒక్కోసారి ఏడ్చేదికూడాపాపం" మరలా అంది.

"పాపం మీ అమ్మ ఏమనుభవించిందనీ! దాన్ని అర్థం చేసుకోశైలూ" శైలజ మాట్లాడలేదు తను తల్లిమీద జాలిపడ్డా, నేను జాలిపడడం ఆపిల్లకు నచ్చినట్టులేదు.

నేను సమర్థించాను

'నా ఉద్దేశ్యం... ఆ విసుక్కోవడం అనేది నీమీద కోపంతో కాదమ్మా దానీమీద దానికి కోపంతో, గిల్టీ ఫీలింగ్‌తో" కళ్లెత్తి చూసింది శైలజ. ఈ సారి ఆకళ్లల్లో తల్లిపట్ల సానుభూతి "అందుకే ఆంటీ నేనెవరితోనూ ఫ్రెండ్‌షిప్ చేయడంలేదు. చేస్తే నాన్న గురించి అడుగుతారు. నాకు నాన్న అమ్మకలసి లేరని చెప్పడం నాకిష్టంలేదు"

టీనేజ్‌లోకి పాదం మోపిన గుర్తుగా ఆపిల్లలో కొత్తగా భేషజాలు.

"పేరెంట్స్‌డేకి ఒక్కోసారి అమ్మకూడా వచ్చేది కాదు. రమ్మంటే ఏడ్చేది. నాకెంత ఏడుపొచ్చేదనీ! ఆ రోజుల్లో అందరికీ అమ్మానాన్న వచ్చి వాళ్లను ఒళ్లో కూర్చోపెట్టుకునేవారు ... అందుకే... అందుకే ఇప్పుడు పేరంట్స్‌డేకి వెళ్లడంమానేశాను".

శైలుని అలా చూడ్డం నాకు సాధ్యంకాని పనిగా అన్పించింది.

ఈ తల్లిదండ్రుల్లో ఎంత క్రూరత్వం! ఎంత స్వార్థం!! వాళ్ల కారణంగా ఎంత అందమైన బాల్యాన్ని కోల్పోయింది శైలు! మనసులు కలవనపుడు ఓ కొత్త ప్రాణిని ఈ లోకంలోకి తేకముందే విడిపోవాలిగానీ.

"శైలూ! నీకు మీనాన్న దగ్గరకు వెళ్లాలనుంటే చెప్పు నేను తీసుకెళ్తాను" నష్టపోయిన శైలు మీద జాలి అనే సముద్రంలో మునిగిపోయి ఒకరకమైన భావావేశంలో అడిగాను.

"ఆంటీ! మా నాన్న దగ్గరకు వెళ్లాలని నాకుండదా ఆంటీ? నా జీవితంలో నాకున్న ఒకే ఒక్క కోరిక అది" ఆశగా చెప్పింది శైలు. ఎంత దురదృష్టం. ఈ వయసు పిల్లల్లో తల్లీతండ్రీ తీర్చలేని కోరికలెన్నో. ప్రస్తుత మార్కెట్లో ఆకర్షిస్తూ ఎన్ని ఆశలో!! అలాంటిది శైలూలో ఏకైక కోరిక - కోరికలు తీర్చాల్సిన తండ్రి మాత్రమే తనకు కావాలి.

"అమ్మను కూడా ఒప్పించండాంటీ. అమ్మా, నేనూ ఇద్దరం వెళ్లి నాన్నతో వుంటాము" ఆ పిల్ల ఆశపడచ్చుకానీ నేను ఆ శను వెలిగించకూడదు.

"అది వీలవదు లేమ్మా శైలూ. మీ నాన్నకు మరో భార్యా పిల్లలు వున్నారు" నిరాశపడలేదు శైలు.

"ఉండనీండాంటీ... ఎంచక్కా నేనూవాళ్లతో ఆడుకోవచ్చు. పేరెంట్స్ డేకి వాళ్లనికూడా తీసుకెళ్లొచ్చు. అప్పుడు అప్పుడూ మా ఫ్రెండ్స్ పొగురు అణిగేది!"

"మరీ మీ అమ్మ?"

"అమ్మ కూడా సర్దుకుంటే... అమ్మకు నాన్న వుంటాడు" పెద్దదాన్నయ్యాననుకుని పెద్దమాటలు మాట్లాడే శైలజలో ఎంత పసితనం!

"సరే అమ్మనువదిలేయ్. మీనాన్న నిన్ను ఆపిల్లలతో సమంగా చూడకపోతే నువ్వు బాధపడవా?" శైలజ ఆశను ఆర్పేసే ప్రయత్నంలో అన్నాను.

"ఊహు నేను సర్దుకుంటాను. నాన్న కావాలి నాకు అంతే దేన్నయినా భరిస్తాను" నాకు జాలేసింది.

అక్కడి బాధలు శైలజ వయసుకు అర్థమయినా తండ్రి కావాలనే బలమైన కోరికముందు అవన్నీ పట్టించుకునేవిగా కనబడడం లేదా పిల్లకు.

"ఎప్పుడైనా నీకు ఏదైనా గిఫ్ట్స్ పంపేవాడా నాన్న?" శైలజ కోరికను బలహీనపర్చాలని అడిగాను. "లేదు" తలవంచుకుంది శైలజ. "అలాటినాన్న నీకెందుకు శైలూ"

"నాకు నాన్నే గిఫ్ట్‌గా కావాలాంటీ"

నేను కదిలిపోయాను. ఎంత సహజమైన కోరిక. అందని ఎండమావి ఎందుకయిందది? ఎవరివల్ల?'

ఆ ఆవేశంలో అటేవెళ్లిపోనాలనుకున్న దాన్ని మరలా స్వప్న దగ్గరకెళ్లాను. స్వప్న ఒంటరిగ్గా వంటింటి గడపలో కూర్చొనుంది. తనకు తెలుసు మా ఇద్దరి మధ్య ఎలాటి సంభాషణ జరిగుంటుందో! నా స్నేహితురాలిని చూడగానే నాలో ఆవేశం కాస్తచల్లబడింది. "శైలూని విసుక్కోకు స్వప్నా అది బాధపడ్తోంది"

"ఖర్చయిపోయిననా జీవితం గురించి ఎవ్వరూ ఆలోచించరు. నాన్న కూడాశైలుని వెనకేసుకొస్తారు ఆరోజు ఆయన కాదూ. 'నా బిడ్డ నాకు బరువవుతుందా?' అని ఆయన

దగ్గర నుండి నన్ను లాక్కెళ్లింది! విసురుగా అంది స్వప్న.

"నిజమే స్వప్నా మీ నాన్నగారు తన బిడ్డ బాధఅంతా ఆలోచించారు. ఇప్పుడు నష్టపోయింది నీబిడ్డ. ఆయన బిడ్డకాదు"

అంటే అంటే నేను నా బిడ్డ గురించి ఆరోజు ఆలోచించివుంటే.... ఆ... ఆ.. నిజమే నేనుతప్పుచేశాను. పిచ్చిదానా అంటున్న నాస్నేహితురాలి భుజంమీదనేను చెయ్యివేసాను.

"స్వప్నా నిన్ను నేను తప్పుపట్టడంలేదు. నువ్వయినా నేనయినా ఆ వయసులో తీసుకునే నిర్ణయాలు ఇలాగే ఉంటాయి. ఉడుకురక్తం కదా! కాకపోతే పాపం ఆ పిల్ల పరిసితి కూడా. నువ్వర్ధంచేసుకో తోటి పిల్లలతో కలవలేకుంది నువ్వు దగ్గరకుతీయకపోతే ఇంకెవరు దగ్గరకు తీస్తారు?"

'నువ్వూ ఇలాగే మాట్లాడుతున్నావు. ఆ రోజుల్లో నాబాధలు నీకు తెలియనివా?" బేలగా అంది స్వప్న. నేనుశైలూగురించి మాట్లాడుతుంటే తను తన గురించే ఆలోచిస్తోంది. అందుకే కోపంగా అన్నాను. "తెలుసు నీ విషాద దాంపత్య జీవితం గురించీ తెలుసు"

"కానీ తెలియందల్లా శైలూనెందుకు కన్నావని?"

"పూర్తిగా విడిపోతామనుకోలేదు క్రిందామీదా పడుతూ ఏదో సంసారం సాగిపోతుందనుకున్నాను". గిల్టీగా తలవంచుకుంది స్వప్న.

"అనుకుంటే ఎలా ఇప్పుడు నష్టపోయింది శైలు మీరిద్దరూ, క్రిందా మీదా పడైనా కడదాకా. సంసారం చెయదలరోలేదోనని ఆలోచించి కనీసం ఓ మూడేళ్ళయినా, ఆగి, నిర్ధారణ చేసుకున్నాకే..... పిల్లల్ని కనాల్సింది. అప్పుడు నువ్వూ మరో పెళ్ళి చేసుకుని సుఖపడివుందువు. ఇలా పుట్టి తండ్రికి దూరంగా మానసిక హింసననుభవిస్తున్న శైలుని ఎలాటి సహాయం అందించలేక నిస్సహాయంగా మిగలిపోయేదుస్థితి మనకుందీకాదు".

"నిజమే నీతా పొరపాటయిపోయింది నిట్టూర్చింది స్వప్న."